క్లుప్తంగా

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి



బెల్లంకొండ: అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ తెలిపారు. సోమవారం వెంకటాయపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహార పదార్థాలను అందించాలని, ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట గ్రామ సర్పంచ్ ముఖ్య నాగమ్మ బాయి, శ్రీను నాయక్, నాయకులు ఉన్నారు.

‘టుబాకో ఫ్రీ స్కూల్’ విజయవంతం



రొంపిచర్ల : మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం ‘టుబాకో ఫ్రీ స్కూల్’ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవి నాయక్ మాట్లాడుతూ పొగాకు వాడకం ఎంతో హానికరమని అన్నారు. పొగాకు తాగినా, పీల్చినా, నమిలినా, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయన్నారు. విద్యార్థులు పాఠశాల, ఇంటి పరిసర ప్రాంతాలలో పొగాకు వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించి, చైతన్య పరచాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులచే పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా విద్యార్థులచే నినాదాలు చేయించి, ప్లే కార్డులు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఉచిత వినికిడి పరికరాలకు 98 మంది దరఖాస్తు

నరసరావుపేట: పాత గవర్నమెంట్ హాస్పిటల్‌లోని జిల్లా సత్వర చికిత్స కేంద్రం (డీఇఐసీ)లో నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివేన్షన్ అండ్ కంట్రోల్ అఫ్ డెఫ్నెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉచిత వినికిడి పరీక్షలు, పరికరాల కొరకు దరఖాస్తులు స్వీకరించామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. దీనిలో 98 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరికి త్వరితగతిన వినికిడి మిషన్లు అందిస్తామని చెప్పారు.

పలువురు ఉద్యోగులు బాధ్యతల స్వీకారం

మాచర్ల రూరల్: ఉద్యోగుల సాధారణ బదిలీలలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా గుంటా వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. ఈమె గురజాల ఆర్డీఓ ఆఫీసులో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ బాషా వెల్దుర్తి మండలానికి వెళ్లారు. ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌గా చేవూరి రామాంజనేయులు నియమితులయ్యారు. ఈయన గురజాల ఆర్డీఓ ఆఫీసులో పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ మస్తాన్‌వలి వెల్దుర్తి మండలానికి వెళ్లారు. కొత్తపల్లి వీఆర్‌ఓగా షేక్ ఖాజావలి నియమితులు కాగా ఈయన దాచేపల్లి మండలం మాదినపాడు వీఆర్‌ఓగా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు వారు తహసీల్దార్ ఎండీ జియా ఉల్‌హుక్‌కు నియామక ఉత్తర్వులు అందించి విధుల్లో చేరారు.

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం

మాచర్ల: వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కోదండ రామాలయంలో యూనివర్సల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్, ఎంసెట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి క్యాష్ ప్రైజ్, షీల్డ్‌లు అందించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జేబీఆర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ప్రైవేటు విద్యకు తల్లిదండ్రులు మొగ్గు చూపటం సరికాదన్నారు. తామంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నతస్థాయికి వచ్చామన్నారు. పలువురు జిల్లా కలెక్టర్లుగా, ఉన్నతాధికారులుగా ఎదిగిన వారున్నారన్నారు. బాలుర, బాలికోన్నత పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నారన్నారు. యూనివర్సల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిర్వాహకులు ఆవుల వెంకటేశ్వర్లు, ఆంజనేయులు ప్రతిభగల విద్యార్థులకు క్యాష్ అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. అనంతం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలో 10, ఇంటర్, ఎంసెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఫౌండేషన్ ట్రస్ట్ నిర్వాహకులతో కలిసి బహుమతులు అందజేసి వారిని ఎమ్మెల్యే అభినందించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు, కళాశాల ప్రిన్సిపాల్ ఉల్లయ్య, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

శిథిలా‘అవస్థ’



శిథిలావస్థలో వంతెన



వంతెన అంచుల్లో పిచ్చి మొక్కలు

- చిలుకలూరిపేట మేజర్ కాల్వపై ప్రమాదకరంగా వంతెన
- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- భయం గుప్పిట్లో ప్రయాణం
- పట్టించుకోని అధికారులు

నకరికల్లు: శిథిలావస్థకు చేరిన వంతెనపై భయం గుప్పిట్లో ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. ఏళ్లుగా వంతెన ప్రమాదకరంగా మారినప్పటికీ సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని దేచవరం గ్రామ పరిధిలో ఆదర్శ పాఠశాలకు అతి సమీపంలో చిలుకలూరిపేట మేజర్ కాలువ ఉంది. ఈ కాల్వపై వంతెన నిర్మించారు. పాతకాలం నాటి వంతెన కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. వంతెన మొత్తం గోతులమయంగా మారింది. వంతెనకు ఇరువైపులా ఉండే గోడలు కూలిపోయి రక్షణ కరువైంది. ఈ ప్రదేశంలో పిచ్చి మొక్కలు పెరిగి కనీసం వంతెన ఉన్న విషయం దగ్గరకు వచ్చే వరకు తెలియడం లేదు. నిత్యం ఆదర్శ పాఠశాల బస్సులు వంతెనపై రాకపోకలు సాగిస్తుంటాయి. రైతులు గడ్డి మోపులు, మందు కట్టలు వేసుకొని ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటారు. రాత్రిళ్లు పొలాలకు వెళ్లేందుకు కూడా రైతులు ఈ వంతెనపై నుంచే వెళ్లి వస్తుంటారు. దేచవరం నుంచి నరసరావుపేట వెళ్లాలన్న ప్రతి ఒక్కరూ ఈ వంతెనపైనే ప్రయాణం చేయక తప్పదు. వరి నాట్లు, కోతల సీజన్‌లో కూలీలతో ఆటోలు, ట్రాక్టర్‌లు, దమ్ము ట్రాక్టర్లు, ధాన్యం లోడుతో లారీలు తిరుగుతుంటాయి. కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ వంతెనపై ప్రయాణంతో ఏ క్షణాన ప్రాణాపాయం వస్తుందోనని గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఎన్నెస్పీ అధికారులు స్పందించి సత్వరమే వంతెనకు మరమ్మతుల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు కావాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకుని, ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని వేద కళాశాల, కాకతీయ కల్యాణ మండపంలో ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. ప్రతిభావంతులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పరిశీలకులు వేములకొండ శ్రీనివాస్, టీడీపీ నాయకులు ఎలినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, వేద కళాశాల డైరెక్టర్ సీహెచ్‌రమేష్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనధీకృత పురుగుమందులు స్వాధీనం



సత్తెనపల్లిలో స్వాధీనం చేసుకున్న పురుగుమందు నిల్వలు

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): వడ్డవల్లిలోని అంజనేయ స్వామి గుడి ప్రాంతంలోని గొడౌన్‌లో 418 లీటర్లు, రూ.5,85,240లు విలువ చేసే అనధీకృత పురుగుమందు నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు సత్తెనపల్లి ఇన్‌చార్జ్ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. సమాచారం మేరకు.. వడ్డవల్లి వీఆర్వో అనిల్ ఆధ్వర్యంలో తనిఖీలు జరపగా గొడౌన్ లో పురుగు మందులు నిల్వలు గుర్తించామని అధికారులు తెలిపారు. విచారణ జరపగా నిల్వలు పట్టణంలోని శివశంకర ఫర్టిలైజర్స్ కు చెందిన నిర్ధారించడం జరిగిందన్నారు. ఈ గొడౌన్ సంబంధిత దుకాణానికి జతపరచలేనందున నిల్వలన్నీ అనధీకృత పురుగుమందులుగా గుర్తించామన్నారు. బీఏఎస్ఎఫ్‌కు చెందిన పురుగు మందులు 26లీటర్లుకు గాను రూ.61,500, బెస్ట్ ఆగ్రో లైఫ్ లిమిటెడ్ కంపెనీకి సంబందించిన పురుగుమందులు 70 లీటర్లు గాను రూ.1,10,300లు, పీఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి సంబందించిన పురుగు మందులు 320లీటర్లుకు గాను రూ.4,13,440లు నిల్వలున్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. సీజ్ చేసిన మందులను భద్రతా చర్యల్లో భాగంగా పట్టణంలోని ఆదిత్య సీడ్స్ పురుగు మందుల దుకాణంలో ఉంచటం జరిగిందన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి



గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు అందిస్తున్న కౌన్సిలర్ సతీష్

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): పట్టణంలోని శ్రీనివాస మహల్ థియేటర్ పక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న కట్టడాన్ని నిలుపుదల చేయాలని పట్టణంలోని 11 వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్ సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు.. సినిమాహాలుకు తూర్పుగా ఉన్న స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్, అప్పర్ ఫ్లోర్ నిర్మాణానికి గాను మట్టా సుబ్రమణ్యేశ్వర రావు బిల్డింగ్ ఆర్డర్ పొందాడు. నిబంధనలకు విరుద్ధంగా స్థలంలో 15 అడుగుల లోతు మట్టిని తీసి సెల్లార్ పార్కింగ్ నిర్మాణ పనులు జరుపుతున్నాడు. అధికార పార్టీ నాయకుల అండతో నిర్మాణాలు జరుపుతూ రెండు వైపులా ఉన్న బజారులలో రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాడు. జిల్లా కలెక్టర్ మున్సిపల్ ప్లాను కు విరుద్ధంగా నిర్మాణం జరుపుతున్న కట్టడాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ ఫిర్యాదు అందించారు.

అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యలయంలో అధికారులతో కలసి ప్రజా దర్బార్ నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో ఎమ్మెల్యే ప్రవీణ్‌కు వివరించారు. మొత్తం 179 అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలతో అధికారుల వద్దకు వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. అత్యధికంగా పెదకూరపాడు, రామాపురం కాశిపాడు గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు వచ్చాయని, చిన్న చిన్న వాటిని కూడా పరిష్కరించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు బాధపడితే చర్యలు తప్పవన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్తిమళ్ల రమేష్, సర్పంచ్ గుడిపూడి రాజు, జనసేన నాయకుడు మల్లెల చలపతిరావు, తహసీల్దారు దానియేలు, ఎంపీడీవో రామకృష్ణ, మాజీ ఎంపీపీ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను తొలగించడం అన్యాయం

కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల ఎదుట సీఐటీయూ నాయకుల ధర్నా



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

నరసరావుపేట: రాజకీయ కారణాలతో తొలగించిన మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకొని వారికి రెండు నెలల జీతం బకాయిలను చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల ఎదుట ధర్నా చేసి ఆయా కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ తొలగించబడిన 15మంది కార్మికులు గత పది, పదిహేను ఏళ్ల నుంచి పనిచేస్తున్నారన్నారు. వీరిని అర్ధాంతరంగా విధుల్లోకి రావొద్దని మున్సిపల్ కమిషనర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వీరికి చెల్లించే జీతాల నుంచి పీఎఫ్, ఈఎస్‌ఐలకు డబ్బులు కట్ చేశారన్నారు. ఇప్పుడు వీరిని ఉద్యోగాలకు రావొద్దని చెప్పి వారి కుటుంబ సభ్యులను మానసిక సంక్షోభానికిగురిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ శిలార్, పట్టణ గౌరవాధ్యక్షుడు షేక్ చిన్న అల్లాబక్షు, షేక్ సైదా, బి.నాగమల్లేశ్వరి, ఏ.పద్మ, రమాదేవి, షేక్ మహబూబుబాష పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: రైతులకు ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి ఆయన మాట్లాడారు. సీపీలు లేకుండా ఎరువులు, పురుగు మందులు రైతులకు అమ్మడం చట్టప్రకారం నేరమన్నారు. ఎప్పటికప్పుడు షాపులలో ఉన్న ఎరువులు, పురుగు మందుల వివరాలు, క్రయ, విక్రయాలకు సంబంధించి సమాచారం స్టాక్ రికార్డులలో నమోదు చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు, పురుగు మందులకు ఇచ్చే బిల్లులో తేదీ, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్ నమోదు చేయాలన్నారు. షాపులో స్టాక్ వివరాల రికార్డు ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులు అడిగిన రసాయనిక మందులను మాత్రమే ఇవ్వాలన్నారు. అనుమతి లేని మందులను, ఎరువులను విక్రయించిన అటువంటి షాపు నిర్వాహకులపై తీవ్రమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాచర్లలో చిరు జల్లులు

మాచర్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం రాత్రి పట్టణంలో చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పలు దఫాలుగా చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. అల్పపీడనం నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ దూళిపాళ్ళ వేణుబాబు అధికారులతో సమీక్షించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

‘పల్లె పండగ’ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్



తొండపి భూమిపూజ కార్యక్రమంలో ఎంపీడీవో విలియమ్స్

పెదకూరపాడు: పల్లె పండగ – ప్రగతికి అండగా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ బొమ్మ నుంచి రూ.50 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సంగం డెయిరీ కేంద్రం వరకు నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో ప్రధాన రహదారిలో ఒకటైన పంచాయతీ కార్యాలయం రోడ్డుకు మోక్షం కలుగుతుందన్నారు. రోడ్డు నిర్మాణం, విస్తరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వారి వెంట మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్తిమళ్ల రమేష్, గోపాలరావు, అప్పారావు, ఆజిము ల్లా, సర్పంచ్ గుడిపూడి రాజు, బాబురావు, శ్రీను, మిలటరి మౌలాలి, కంచర్ల సుధకర్ ఉన్నారు.

పల్లె పండగ వారోత్సవాలు

రాజుపాలెం: మండలంలో ఈ నెల 20వ తేదీ వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ సోమ వారం తెలిపారు. 15న రెడ్డిగూడెం, గణపవరం, బలిజేపల్లి, ఇనిమెట్ల, 16న అంచులవారిపాలెం, చౌటపాపాయపాలెం, కొత్తబోధనం, రాజుపాలెం, 17న బ్రాహ్మణపల్లి, బీరవల్లిపాయ, కొత్తపాలెం, ఉప్పలపాడు, 18న కోటనెమలిపురి, నెమలిపురి, శ్రీనివాస్‌నగర్, అనుపాలెం, 19న దేవరంపాడు, మొక్కపాడులో వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ వారోత్సవాలలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని సూచించారు.

రెండు గ్రామాల్లో

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి, రుద్రవరం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం సోమవారం జరిగింది. పలు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. రుద్రవరంలో రూ.10 లక్షలు, తొండపిలో రూ.9.5లక్షలతో సీసీ డ్రైయిన్‌ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.జె.విలియమ్స్, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో అభివృద్ధి పనులకు సర్కారు శ్రీకారం

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): రాష్ట్రంలో అభివృద్ధి పనులకు పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల కార్యక్రమానికి కూటమి సర్కారు శ్రీకారం చుట్టిందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. మండలంలోని కట్టావారిపాలెం, కంటెపూడి, బీమవరం గ్రామాల్లో అంతర్గత సీసీ డ్రెయిన్స్, మెటల్ రోడ్ల నిర్మాణాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామ సభల్లో ఆమోదించిన పనులు ప్రారంభమవుతాయన్నారు. కట్టావారిపాలెం గ్రామంలో రూ.15లక్షలు, కంటెపూడి గ్రామంలో రూ.20లక్షలు, బీమవరం గ్రామంలో రూ.8లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మదమంచి పార్వతీ, ఎంపీటీసీ దేవినేని అనురాధ, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, మదమంచి రాంబాబు, ఆళ్ళ సాంబయ్య, మొక్కపాటి రామచంద్రరావు, కోయ లక్ష్మయ్య, కొబ్బరి సుబ్బారావు, పీఆర్ డీఈ శేఖర్‌బాబు, ఏఈ రామ్మోహన్‌సింగ్ ఆయా శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో పల్లె పండుగ

అచ్చంపేట: మండలంలోని కోనూరు, కస్తల, మాదిపాడు, చల్లగరిక గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ-పంచాయతీ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కస్తలలో రూ.30వేలతో పశువులకు షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్లెపండుగ - పంచాయతీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిందన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ శ్వేత, సర్పంచ్ షేక్ మహబూబ్‌సుభాని, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

బెల్లంకొండ: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. సోమవారం ‘పల్లె పండుగ’ వారోత్సవాలను మండలంలోని చంద్రాజుపాలెం, వన్నాయపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పనులను ఏపీవో కోటమ్మ వివరించారు. చంద్రాజుపాలెంలో ఒక బిటీ రోడ్డు, 3 మినీ గోకులాలు, వన్నాయపాలెంలో ఒక మినీ గోకులం షెడ్లకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ శేషప్పయ్య, సెక్రటరీ లక్ష్మీబాయి, మండల టీడీపీ నాయకులు గుంజా గంగారావు, మేకల వెంకటస్వామి, శ్రీను, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఊటుకూరు, అందుకూరు గ్రామాల్లో..

క్రోసూరు: మండలంలోని ఊటుకూరు, అందుకూరు, బయ్యవరం గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో బి.మహేష్‌బాబు, ఉపాధి హామీ పథకం ఏపీవో బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పశుపోషకుల కోసం షెడ్లు ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఊటుకూరులో ఇద్దరు, అందుకూరులో ముగ్గురు పశు పోషకులకు షెడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పశుపోషకులు, పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



కస్తలగ్రామంలో పశువుల షెడ్డుకు శంకుస్థాపన చేసిన ఎంపీడీవో శ్రీనివాసరావు



శంకుస్థాపన చేసిన ఎంపీడీవో బి.మహేష్‌బాబు, ఏపీఓ

ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకం

ఆంగ్ల బోధకులు నాగేశ్వరరావు



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన పాఠశాల ఉపాధ్యాయులు

శావల్యాపురం: సమాజంలో ఉపాధ్యాయులు పాత్ర చాలా కీలకమైందని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల సీనియర్ ఆంగ్ల బోధకులు స్టాఫ్ సెక్రటరీ బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి (రోటరీ క్లబ్ గుంటూరు) జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాస రాజు, పీడీ రాగుల రాధాకృష్ణ మూర్తిలకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలతో పాటు సమాజ భాగస్వాములై భావితరాలకు విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకంగా మెలగాలన్నారు. సామాజిక సేవా భావం కల్గియున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం గుర్తించటం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా పూలమాలలు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ

మాచర్ల: పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను పురపాలక సంఘ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఆర్యవైశ్య నాయకుడు కంభంపాటి అనిల్‌లు అందజేశారు. సోమవారం 100 మంది కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. కంభంపాటి అనిల్ సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించామని, రాబోయే రోజుల్లోనూ ప్రతి కార్మికుడికి ప్రయోజనం కల్పించేలా చర్యలు తీసుకొని సౌకర్యాలు కల్పించేలా తన వంతు కృషి చేస్తామని చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు.